పత్రికాప్రకటన                                        కాకినాడ, 17.12.2017

కాకినాడ బీచ్ ఫెస్టివల్‌ను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు సమగ్రంగా చేపట్టామని, మూడు రోజుల వేడుకలను ప్రజలు ఆస్వాదించి విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కార్తికేయ మిశ్రా కోరారు.

ఆదివారం సాయంత్రం జిల్లా కలెక్టర్ కార్తికేయ మిశ్రా జిల్లా అధికారులు, మీడియా ప్రతినిధులతో కలిసి స్థానిక ఎన్‌టిఆర్ సాగరతీరంలో కాకినాడ బీచ్ ఫెస్టివల్ ఏర్పాట్లను పరిశీలించి అవసరమైన మార్పులు, తుది మెరుగులను సూచించారు. అలాగే ఈ వేడుకలకు విచ్చేసే ప్రముఖులు, ప్రజల కొరకు నిర్ధేశించిన రూట్లను, బారికేడింగ్‌లను పరిశీలించి వాహనాలు, ప్రజల సంచారం అవరోధాలు లేకుండా సజావుగా సాగేలా ట్రాఫిక్ నియంత్రించాలని పోలీస్ అధికారులను కోరారు. వివిఐపిలు, విఐపిలు, అధికారులు, మీడియా కొరకు కేటాయిస్తున్న గ్యాలరీలు, వాటి ప్రవేశ, నిర్గమన దారులను ఆయన పరిశీలించి, మరింత వెసులుబాటుగా ఉండేందుకు చిన్న చిన్న మార్పులు సూచించారు. అనంతరం వేదికకు సమీపంలో హరితా రిసార్ట్స్‌లో మీడియా ప్రతినిధులతో సమావేశమై బీచ్ ఫెస్టివల్ వేడకలలో పొందు పరిచిన సాంస్కృతిక, ఉల్లాస కార్యక్రమాలు, ప్రజలు, మీడియా సౌకర్యం కొరకు చేపట్టిన సదుపాయాలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 19 నుండి 21వ తేదీ వరకూ మూడు రోజుల పాటు నిర్వహిస్తున్న కాకినాడ బీచ్ ఫెస్టివల్‌ను 19వ తేదీ మంగళవారం సాయంత్రం రాష్ట్ర మంత్రులు, జిల్లా ఇన్‌చార్జి మంత్రి ప్రారంభిస్తారని తెలిపారు. అదే రోజు ఈ కార్యక్రమంలోనే జిల్లాలో స్వచ్ఛ భారత్ స్ఫూర్తిని నిరంతరం కొనసాగించే లక్ష్యంగా ఓడిఎఫ్ ప్లస్ ఉద్యమాన్ని కూడా మంత్రులు ప్రారంభిస్తారన్నారు. పారిశుధ్యం, పరిశుభ్రత పరంగా ప్రజల అలవాట్లు, దృక్పధంలో సుగుణాత్మకమైన మార్పు తెచ్చేందుకు స్వయం సహాయ బృందాలు, శ్రమశక్తి సంఘాలు, విద్యార్థుల భాగస్వామ్యంతో అవగాహన, చైతన్య కార్యక్రమాలను ఈ ఓడిఫ్ ప్లస్ ఉద్యమంలో ముమ్మరంగా చేపడతామన్నారు. బీచ్ ఫెస్టివల్ తొలిరోజు తెలుగువారి అభిమాన గాయకుడు ఎస్.పి.బాలసుబ్రమణ్యం, రెండవ రోజు వర్ధమాన సినీగాయకుల స్టార్‌నైట్ ప్రధాన ఆకర్షణలుగా ఉండగా, మూడవ రోజు ఖండాంతర ఖ్యాతి గడించిన ప్రముఖ సంగీత దర్శకులు ఎ.ఆర్.రెహమాన్ ఉర్రూతలూగించే సంగీత విభావరి, మిరుమిట్లు గొలిపే బాణాసంచా షోలతో వేడుకలు ముగుస్తాయన్నారు. వీటితో పాటు ప్రతి రోజు ప్రధాన కార్యక్రమాలకు ముందు 15 నుండి 20 మంది స్థానిక కళాకారుల ను ప్రోత్సహిస్తూ వారి నైపుణ్యాలను, కళాకౌశలాలను ప్రదర్శించేందుకు అవకాశం కల్పిస్తున్నామన్నారు. ఈ వేడుకలలోనే జాతీయ స్థాయి రాక్ బాండ్ పోటీలు నిర్వహిస్తామని, తొలి రోజు 25 మంది, రెండవ రోజు 25 మంది తమ ప్రదర్శనలు ఇస్తారన్నారు. ఈ ప్రదర్శనలలో ప్రధమంగా నిలిచిన రాక్‌బాండ్ బృందానికి మూవ రోజు ఏ.ఆర్.రెహమాన్‌తో కలిసి ప్రదర్శించే అవకాశం కల్పించడం జరుగుతుందన్నారు. అలాగే వేదికల ప్రాంగణంలో ప్రతి వయస్సు వారిని అలరించే ఆకర్షణలు ఏర్పాటు చేస్తున్నామని, ఇందులో బాగంగా హెలిరైడ్, పారాగ్లైడ్స్, వాటర్ స్కీలు, బీచ్ వాలీబాల్, కబడ్డీ క్రీడలు, సాహస క్రీడలు, కిడ్‌జోన్స్, ఫుడ్ కోర్టులు, శాండ్ ఆర్ట్ ప్రదర్శన, శిక్షణలు వంటి ఎన్నో అంశాలు ఉంటాయన్నారు. ముఖ్యంగా మహిళల కొరకు రంగోలి ముగ్గుల పోటీలు, మెహందీ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ వేడుకలకు వచ్చే సందర్శకుల కొరకు కాకినాడ నగరంలోని ప్రధాన కూడళ్ల నుండి ఆర్‌టిసి బస్సులు ఏర్పాటు చేసామని, అలాగే తమ స్వంతవాహనాలపై వచ్చే వారు వాటిని నిర్ధేశించిన పార్కింగ్ ప్రదేశాలలో ఉంచి, అక్కడ నుండి ఏర్పాటు చేసిన ఉచిత వాహనాల్లో వేదిక ప్రాంగణానికి చేరుకోవచ్చునని తెలిపారు. విఐపి వాహనాలు, అత్యవసర సేవా వాహనాల కోసం డెడికేటెడ్ గ్రీన్ ఛానల్ రూట్ నిర్ధేశించామన్నారు. మీడియా సౌకర్యం కొరకు ప్రత్యేక గ్యాలరీ, మీడియా సెంటర్ ఏర్పాటు చేశామన్నారు. బీచ్ ఫెస్టివల్ ఏర్పాట్లకు ప్రజలు, మీడియా అన్నివిధాల సహకరించి వేడుకలను విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కోరారు.

హెలిరైడ్ ను ప్రారంభించిన జిల్లా కలెక్టర్ :

కాకినాడ బీచ్ ఫెస్టివల్‌లో ప్రత్యేక ఆకర్షణగా ఏర్పాటు చేసిన హెలిరైడ్ అంశాన్ని జిల్లా కలెక్టర్ కార్తికేయ మిశ్రా ఆదివారం సాయంత్రం స్థానిక పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లోని హెలిపాడ్ నుండి జెండా ఊపి ప్రారంభించారు. ఇందు కోసం వినియోగిస్తున్న హెలికాప్టర్‌లో ఆయన, జాయింట్ కలెక్టర్లు, రాజమండ్రి సబ్‌కలెక్టర్, అసిస్టెంట్ కలెక్టర్‌లతో కలిసి టెస్ట్ రైడ్ ట్రిప్‌లో విహరించి హెలిరైడ్ రూట్‌ను పరిశీలించారు.

ఈ కార్యక్రమాలలో జాయింట్ కలెక్టర్ ఎ.మల్లికార్జున, జాయింట్ కలెక్టర్-2 జె.రాధాకృష్ణమూర్తి, రాజమండ్రి సబ్ కలెక్టర్ సాయికాంత్‌వర్మ, ఎఎస్‌పి ఎ.ఆర్.దామోదర్, డిఆర్‌ఓ యుసిజి నాగేశ్వరరావు, ఆర్‌డిఓ ఎల్.రఘుబాబు, టూరిజం ఈడి భీమశంకరరావు, విజ్‌క్రాఫ్ సంస్థ మేనేజరు ఊర్వశి తదితరులు పాల్గొన్నారు.

(సమాచార శాఖచే జారీ)